క్లుప్తంగా

మొక్కల పంపిణీ



ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

బలిజిపేట: మొక్కలు పెంచాలనే ఆసక్తి గల వారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. ఉపాధి హామీ పథకం కింద మిర్తివలస నర్సరీ వద్ద మొక్కలను పెంచుతున్నారు. వీటిని శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన పలువురికి ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాలకు, రైతులు, ఇతరులెవరైనా ఉచితంగా మొక్కలు అందజేస్తామన్నారు. వీటికి కంచె వేసి రక్షణ చర్యలు చేపట్టి పెంచాలని సూచించారు. మొక్కలు కావాల్సిన వారు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. ఏపీఓ కేశవరావు, ఈఓపీఆర్‌డీ పుష్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా గోకులాల నిర్మాణాలు

సీతానగరం: మండలంలో నిర్మాణంలో ఉన్న గోకులాల షెడ్డులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. పలు గ్రామాల్లో గోకులాల షెడ్లను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో 23 గోకులాల షెడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, నిర్వాహకులు ఉన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పార్వతీపురం విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పార్వతీపురం టౌన్: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పట్టణంలోని ఆర్‌కే కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కరస్పాండెంట్ పూడి రామకృష్ణ శనివారం తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన హ్యాండ్‌బాల్ రాష్ట్ర పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎస్.జాహ్నవి, ఎస్.నిత్యశ్రీ, ఎస్.జ్యోత్స్న విజయం సాధించారన్నారు. జనవరి 9న మహబూబ్‌నగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరిని కళాశాల సిబ్బంది అభినందించారు.

సారా రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ

పార్వతీపురం టౌన్: సారా రహిత పట్టణంగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దుదామని ఎక్సైజ్ ఎస్‌ఐ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో సారా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా రవాణా, అమ్మకాలు వంటి చర్యలు చేపడితే విధించే శిక్షలను ప్రజలకు అవగాహన కల్పించారు. సారా అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అటువంటి వారిపై కఠినంగా వ్యవహస్తామన్నారు. పట్టణంలో సారా అమ్మకాలపై ప్రజలు సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్: ప్రజల సహకారంతో స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో శనివారం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వాతావరణంలో మార్పులు, ప్లాస్టిక్ సంచులు వాడడం వలన అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించాలని సూచించారు. ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఏఎస్ఓ, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు, మేస్త్రిలు, వార్డ్ కౌన్సిలర్లు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమ్మె సైరన్



సేవలు అందిస్తున్న వాహనం

ప్రజారోగ్యమే పరమావధిగా పని చేసేది వారు.. అత్యవసర సమయంలో అర్ధరాత్రి అయినా కుయ్..కుయ్... అంటూ పరుగులు పెట్టే వాహనంలో వెళ్లి వైద్య సేవలు అందించి ప్రాణం పోస్తారు. కానీ వారి జీవితాలకు కూటమి పాలనలో భరోసా లేకుండా పోయింది. తమ సమస్యలను పరిష్కరించాలని కొన్నాళ్లుగా విన్నవిస్తూనే ఉన్నారు. వినతులిచ్చారు... నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. అయినా కూటమి నేతలకు పట్టలేదు. చివరకు చేసేది లేక సమ్మెకు సిద్ధమయ్యారు. వారే 108 సిబ్బంది.

- మొర్రోమంటున్న కుయ్..కుయ్... సిబ్బంది
- సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం
- రేపటి నుంచి సమ్మెలోకి..

బలిజిపేట:

ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో తమ వంతు సాయం అందిస్తూ ప్రభుత్వ ప్రాణాలు కాపాడే 108 సిబ్బంది సమ్మెలోకి వెళ్లనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వీరి పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. తమ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో.. అంటూ కూటమి పాలకులకు గడిచిన ఐదు నెలలుగా విన్నవించుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో అత్యవసర సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి సోమవారం నుంచి వెళ్లనున్నారు. అరకొర వేతనాలతో కంటి మీద కునుకు లేకుండా పగలనక.. రాత్రినక విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కరువైంది. ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న వారు కూటమి ప్రభుత్వ తీరుతో కలవరపాటుకు గురవుతున్నారు. 108 సర్వీసుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు వారిని గందరగోళానికి కారణమైంది. చేసేదిలేక పోరాబాటకు సిద్ధమయ్యారు.



వాహనం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

స్పందించని సర్కారు

తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని 108 సిబ్బంది నిరసన చేపట్టారు. వినతుల ద్వారా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అయినా స్పందించకపోవడంతో ఈ నెల 25 నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లనున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ముందస్తు నోటీసులు ఉన్నతాధికారులకు అందజేశారు.

12గంటల డ్యూటీ విధానాన్ని రద్దు చేయాలి



ప్రస్తుతం ఉన్న 12గంటల డ్యూటీ విధానాన్ని రద్దు చేసి సిబ్బందికి 8గంటల పని విధానాన్ని అమలు పరచాలి. దీనివలన పని ఒత్తిడి తగ్గుతుంది. దీని వల్ల సిబ్బంది ఆరోగ్యవంతంగా ఉంటూ రోగులకు మరిన్ని సేవలు చేయొచ్చు.

– సత్యనారాయణ, 108సిబ్బంది, బలిజిపేట.

సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి



108 సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నాం. ఎన్నో సంవత్సరాల నుంచి ఇదే వాహనంలో పని చేస్తున్నాం. మా సమస్యలు విని వాటి పరిష్కార దిశగా ప్రభుత్వం అడుగులు వేసి మాకు న్యాయం చేయాలని కోరుకుంటున్నాం.

– ధనంజయ, 108సిబ్బంది, బలిజిపేట

వారి డిమాండ్లు ఇవే...

- 108 సర్వీసులోని ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నెంబర్ 49ను పునరుద్ధరించాలి. హైలెట్ గ్రాట్యుటీ, ఎర్నడ్ లీవు అమౌంట్(అర్హత సెలవు మొత్తం), వార్షిక ఇంక్రిమెంటును చెల్లించాలి.
- ప్రతీ నెలా జీతాలు 5వ తేదీలోపు చెల్లింపులు జరగాలి. 108లో షిఫ్టుల పద్ధతి అమలు చేయాలి.
- వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తరువాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20లక్షలు ఇవ్వాలి.
- 108సర్వీసులో ఈఎంటీలుగా పని చేస్తున్న వారి సర్వీసును పరిగణనలోకి తీసుకుని వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టులలో నియమించాలి.
- రెండు షిఫ్టలలో షిఫ్టుకు 12గంటల చొప్పున తీవ్ర పని ఒత్తిడితో పనిచేస్తున్న తమను 3 షిఫ్టలలో రోజుకు 8గంటల పని దినాన్ని అమలుపరచాలి.
- వాహనాలను సరైన కండిషన్‌లో ఉంచాలని, వాహనం మైనర్ మరమ్మతుల బిల్లులు ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని.
- 108 వాహనానికి, దానిలో పని చేస్తున్న సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన భవనాన్ని నిర్మించాలి.

సర్వే వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులతో జరుపుతున్న హౌస్ హోల్డ్ సర్వే పనులు వేగవంతం చేయాలని పార్వతీపురం డివిజినల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) నాగభూషణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి త్రివిక్రమరావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో గృహ సర్వే, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల సర్వే పనులు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు తమ వంతు సహకారాన్ని సంబంధిత సిబ్బందికి అందజేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

ఇలా పనులు జరిపితే ఎలా..



రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే ఎలా అని జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. శంబర పోలమాంబ అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న పనులను ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, వైస్ ప్రెసిడెంట్ అల్లు వెంకటరమణలతో కలసి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వనంగుడి వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు, జరిపిన పనులకు కనీసం వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడంతో, సీసీ రోడ్లు నిర్మాణ దశలోనే గోతులుగా మారుతున్నాయని పీఆర్ డీఈ చిన్నమనాయుడు ముందు అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు జరుపుతున్న సమీపంలోని విద్యుత్ స్తంభాలను పక్కకు తరలించి రహదారులు నిర్మిస్తే, క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాట్లకు సౌలభ్యంగా ఉంటుందని సూచించారు. శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ పనుల్లో అలసత్వం చేయొద్దన్నారు. రూ.రెండు కోట్ల 40 లక్షలతో ప్రతిపాదించిన ఆరు పనులు కలెక్టర్ చొరవ మేరకు తీర్మానం చేయడం జరిగిందని, పనులు సక్రమంగా జరిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట పీఆర్ జేఈ రంజిత్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

సత్యసాయి జయంతి వేడుకలు శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: నగర సంకీర్తనలు చేస్తున్న సత్య సాయి భక్తులు



బలిజిపేట: పి.చాకరాపల్లిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



సాలూరు రూరల్: పల్లకిలో సత్యసాయి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

వేడుకగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్ప పడి పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలంలోని చినబోగిలిలో గురుస్వామి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు అయ్యప్ప పాటలతో అలరించారు. పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: మండలంలోని దొగ్గవానిములగ గ్రామంలో శనివారం పరదేశమ్మ తల్లి అమ్మవారి పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడి వరకు తరలివెళ్లి పూజలను, మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అన్ని వర్గాల వారు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

తూరుమామిడిలో పశువైద్య శిబిరం



మాట్లాడుతున్న ఏడీ సన్యాసినాయుడు

మక్కువ: మండలంలోని తురుమామిడి గ్రామంలో జిల్లా పశుగణనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. సాలూరు పశుసంవర్ధక శాఖ ఏడీ సన్యాసినాయుడు హాజరై పశువైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ దూడల నిర్వహణ, కేవలం ఆడ దూడలు పుట్టే లింగనిర్ధారిత వీర్యం, ఉపాధి హామీ పథకం ద్వారా శతశాతం సబ్సిడీ, బహువార్షిక పశుగ్రాసాల సాగుపై రైతులకు వివరించారు. 82 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి చికిత్స అందించారు. 40 ఆడ లేక దూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు, పశు వైద్యాధికారులు కె.పోలందొర, సురేష్‌కుమార్, ప్రభాకర్‌రావు, జగదీష్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటమే...



ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటమే పీడీఎఫ్ ధ్యేయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. మండలంలోని జోగింపేట కేజీబీవీ, గురుకుల పాఠశాలలను శనివారం ఆమె సందర్శించి ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ సమస్యలపై సుదీర్ఘ పోరాటం చేస్తున్న తనకు ఉపాధ్యాయులంతా అండగా నిలవాలని కోరారు. విద్యా రంగ పరిరక్షణకు నిస్వార్థ పోరాటం చేస్తున్న పీడీఎఫ్ తరఫున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కునుకు మురళి, యూటీఎఫ్ నాయకులు పల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

– సీతానగరం

పోలింగ్ కేంద్రాల సందర్శన



త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అవసరమైన పోలింగ్ కేంద్రాలను సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ సందర్శించారు. సీతానగరం మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న 140, 141, 142, 143 పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావును ఆదేశించారు. వీర్వోలు, వీఆర్ఏలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

– సీతానగరం

అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి



గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో గత దశాబ్ద కాలంగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని గిరిజన విద్యా శాఖలోకి విలీనం చేసి, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్వతీపురం గిరిజన సమగ్ర అభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సమ్మెలో నాల్గో రోజు శనివారం ఆయన పాల్గొన్నారు. వారి న్యాయమైన డిమాండ్లకు మద్దతు పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 1636 మంది ఉపాధ్యాయులను తక్షణమే గిరిజన విద్యా శాఖలోకి విలీనం చేయడంగాని లేదా కనీసం కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా నియమిస్తూ 14వ వేతన సవరణ అనుసరించి వారి పోస్టులకు రావలసిన కనీస వేతనాన్ని ఇవ్వాలని కోరారు.

– పార్వతీపురం టౌన్

జర్మన్ భాషపై శిక్షణ

పార్వతీపురం టౌన్: జిల్లాకు సంబంధించిన ఆసక్తి గల అభ్యర్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని తిరుపతిలో ఈ నెలాఖరు నుంచి నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం మాట్లాడారు. క్యూరా పర్సనల్ భాగస్వామ్యంతో జర్మనీలో పని చేయాలనుకునే నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషా శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులు జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి, 35 ఏళ్లలోపు వయసు గల వారై ఉండాలన్నారు. కనీసం రెండేళ్ల బీఎస్సీ అనుభవం లేదా 3 ఏళ్ల జీఎన్ఎం అనుభవం అవసరమన్నారు. శిక్షణా కార్యక్రమం ఆరు నెలల పాటు తిరుపతిలో నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో జర్మన్ భాషా కోర్సులు నేర్పబడతాయని, అభ్యర్థులు జర్మనీలో పని చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రాథమిక అర్హత పరీక్ష ద్వారా జరుగుతుందని, ఈ పరీక్షలో ఇంగ్లిష్, డిజిటల్ స్కిల్స్, జ్ఞాన పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. వివరాలకు 96769 65949 నంబరును సంప్రదించాలని సూచించారు.

మత్తు జోలికి పోవద్దు..



నారన్నాయుడువలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ



పార్వతీపురం టౌన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్‌ఐ సంతోషి

బలిజిపేట:

మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ సింహాచలం అన్నారు. నారన్నాయుడువలసలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన ప్రజలు పడకూడదన్నారు. వాటిపై ప్రజలకు పూర్తిగా అవగాహన అవసరమన్నారు. అదే విదంగా డ్రగ్ సేవించడం ప్రాణాంతకమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఓటీపీలు ఇతరులకు చెప్పొద్దు..

పార్వతీపురం టౌన్: ఓటీపీలు ఇతరులకు తెలపరాదని రూరల్ ఎస్‌ఐ సంతోషి సూచించారు. స్థానిక ఓ ప్రైవేటు స్కూల్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థినిలు తప్పనిసరిగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.